

మన ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

ప్రజాగళమే.. మా కలం

www. ManaPrajasakti.com

తెలంగాణ\ ఆంధ్రప్రదేశ్



నల్గొండ | మంగళవారం,నవంబర్ 24,2026 | ఎడిటర్: మెరుగు. భరత్ కుమార్ | సంపుటి: 2 | సంచిక:63 | పేజీలు: 8 | వెల: రూ.4/-



పాకిస్థాన్‌లో తీవ్ర గ్యాస్

సంక్షోభం

- పాకిస్థాన్‌లో తీవ్రమైన గ్యాస్ సరఫరా కోతలతో ప్రజల ఇబ్బందులు
- వంట గ్యాస్ కొరతతో ఆకాశాన్నంటిన ఎల్పీజీ ధరలు

ఇంటర్నెట్ న్యూస్, నవంబర్ 23

పాకిస్థాన్‌లో గ్యాస్ సంక్షోభం రోజురోజుకు తీవ్రతరమవుతోంది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆధీనంలోని సుయ్ గ్యాస్ (పైప్‌లైన్ గ్యాస్) సరఫరాలో భారీ కోతలు విధించడంతో వంట చేసుకోవడానికి కూడా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.



బిస్లరీపై ప్రాసిక్యూషన్‌కు

ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి

- ఇది 14 నెలల క్రితం నాటి పాత వ్యవహారమని స్పష్టం చేసిన బిస్లరీ
- గోవా ప్లాంట్‌లోని ఒకే ఒక్క నమూనాకు మాత్రమే సంబంధించిన అంశమన్న సంస్థ

న్యూఢిల్లీ,

ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నమూనాలు భద్రతా పరీక్షల్లో విఫలమయ్యాయంటూ భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇచ్చిన వ్యవహారంపై 'బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్' స్పందించింది.



ఏపీ ప్రాజెక్టులను చట్టబద్ధంగా అడ్డుకుంటాం

మామాఅల్లుళ్లు కృష్ణా నీళ్లను ఏపీకి అప్పనంగా అప్పగించారు

హైదరాబాద్, నవంబర్ 23

తెలంగాణ నీటి హక్కులను జలసమాధి చేసింది ముమ్మాటికీ కేసీఆర్, హరీశ్‌రావు మాత్రమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. వాళ్లిద్దరికీ ఉరేసినా, కోదండం వేసి కొట్టినా తప్పులేదని ఆయన వ్యాఖ్యానించారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడటానికి తాము శాయశక్తులా నిరంతరం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. 'పల్నాడు వాటర్ గ్రిడ్ అంశంపై(బీఆర్ఎస్ దుష్ప్రచారానికి దిగుతున్నది. వాళ్ల హయాంలోనే జగన్ ఆ ప్రాజెక్టును చేపట్టారు.దానిపై నాడు కేసీఆర్ ఒక్కసారి కూడా నోరుమెదపలేదు. వాళ్ల తప్పులను అన్ని ఆధారాలతో ఎండగడుతాం. కృష్ణా నీళ్లను ఏపీకి అప్పనంగా అప్పగించిందీ వాళ్లే.. ఇప్పుడు అబద్ధాలు చెప్తున్నదీ వాళ్లే' అని దుయ్యబట్టారు. సోమవారం ఎంసీహెచ్‌ఆర్డీ సెంటర్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్ రాజనరసింహతో కలిసి మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2004 నుంచి 2006 వరకు వైఎస్సార్ మంత్రివర్గంలో మంత్రులుగా, ఆ తర్వాత 2014లో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత సీఎంగా కేసీఆర్, సాగునీటి పారుదల శాఖ మంత్రిగా హరీశ్‌రావు నీటి హక్కులను శాశ్వతంగా ఆంధ్రాకు తాకట్టు పెట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పల్నాడు వాటర్ గ్రిడ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోలేదని ప్రచారం చేస్తున్నారు. దానిని కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే 2022లోనే జగన్ ప్రారంభించారు.

- వైఎస్సార్ హయాంలో మంత్రిగా పోతిరెడ్డిపాడుకు ఓకే చెప్పింది హరీశే
- ఆయనకు కేసీఆర్ గురువు కాదు.. రాజశేఖర్‌రెడ్డి అసలైన గురువు
- జగన్‌కు ప్రగతిభవన్‌లో విందు ఇచ్చి తల ఊపింది కేసీఆరే
- రాష్ట్రానికి 299 టీఎంసీలు చాలు అని సంతకాలు పెట్టి మరణశాసనం రాసిండు

కాంగ్రెస్‌లో మురా తగాదాలు లేవు





తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలి

బీఆర్ఎస్ నేతల నిర్బంధంపై మండిపడ్డ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

- ఉదయం నుంచే పలువురు ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేల అరెస్ట్
- పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

హైదరాబాద్,

కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని కోరుతూ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించారు. ఈ పరిణామంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచే బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను పోలీసులు హౌస్ అరెస్ట్‌లు, ముందస్తు అరెస్ట్ చేస్తున్నారని విమర్శించారు.మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, శ్రవణ్ కుమార్ సహా పలువురు నాయకులను అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. తాము ఎలాంటి ధర్నాలు లేదా ఆందోళనలు నిర్వహించేందుకు వెళ్లడం లేదని, చట్టబద్ధంగా కేఆర్ఎంబీకి వినతిపత్రం సమర్పించేందుకు మాత్రమే సిద్ధమయ్యామని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులను ఏ కారణంతో నిర్బంధిస్తున్నారో రాష్ట్ర డీజీపీ తక్షణమే ప్రజలకు, పార్టీకి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.అనుమతులు లేకుండానే నాగార్జునసాగర్ వద్ద ఏపీ ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతోందని జగదీశ్ రెడ్డి ఆరోపించారు.

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి

- రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో కిషన్ రెడ్డి, బండి సంజయ్ చెప్పాలని కోమటిరెడ్డి డిమాండ్
- రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు కేబినెట్ ఆమోదంపై బీజేపీ నేతలు స్పష్టత ఇవ్వాలని నిలదీత
- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎలాంటి ప్రజావ్యతిరేకత లేదన్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్,

కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నితిన్ నబీన్ తెలంగాణ పర్యటనల నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏం చేసిందో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఏ మొహం పెట్టుకుని అమిత్ షా, నితిన్ నబీన్ తెలంగాణకు వస్తున్నారని మంత్రి ప్రశ్నించారు. తాను స్వయంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును మంజూరు చేయిస్తే... దానికి కేంద్ర కేబినెట్‌లో ఆమోదం తెలపకుండా ఇప్పటికీ ఎందుకు పెండింగ్‌లో పెట్టారో బీజేపీ నేతలు స్పష్టం చేయాలని ఆయన నిలదీశారు.



సింగరేణి కార్మికుడి దారుణ హత్య

కత్తులతో విచక్షణారహితంగా పొడిచిన దుండగులు

హైదరాబాద్

తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో సోమవారం తెల్లవారుజామున దారుణం చోటుచేసుకుంది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)లో పనిచేస్తున్న రాజశేఖర్ అనే ఉద్యోగిని గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి హత్య చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పవర్ హౌస్ కాలనీలో నివసించే రాజశేఖర్ (30)కు తెల్లవారుజామున 2 గంటల సమయం లో ఫోన్ వచ్చింది.



కష్టకాలంలో ఏడేళ్ల పాటు పీసీసీ చీఫ్‌గా పనిచేశా

- నూతన ఇన్‌ఛార్జ్ బీఎం సందీప్‌తో భేటీ అయిన మంత్రులు ఉత్తమ్, తుమ్మల
- గాంధీ భవన్‌తో తనకు ఎమోషనల్ అటాచ్‌మెంట్ ఉందన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- తన శాఖలో ఒక్కరోజు కూడా విరామం లేకుండా పనిచేస్తున్నానని స్పష్టీకరణ

హైదరాబాద్,

హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీ భవన్‌తో తనకు ఎంతో అనుబంధం ఉందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నూతన ఇన్‌ఛార్జ్ బీఎం సందీప్‌తో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. పార్టీ అంతర్గత వ్యవహారాలతో పాటు తాజా రాజకీయ పరిణామాలపై వీరు చర్చించారు.ఈ భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో తాను ఏడేళ్ల పాటు పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.



విదేశీ ఉపాధిలో తెలంగాణ టామ్‌కామ్ రికార్డ్

- టామ్‌కామ్ ద్వారా 16 దేశాల్లో 14,850 మందికి విదేశీ ఉద్యోగాలు
- కొలువులు పొందిన వారిలో 90 శాతం మహిళలేనని వెల్లడి
- టామ్‌కామ్ పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించిన కేంద్ర కార్మిక శాఖ మంత్రి

హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్), విదేశీ ఉపాధి కల్పనలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పటివరకు 16 దేశాల్లో 14,850 మందికి సురక్షితమైన ఉద్యోగాలు కల్పించినట్టు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జరిగిన జాతీయ స్థాయి 'చింతన్ శిబిరం'లో టామ్‌కామ్ పనితీరుపై కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రశంసలు లభించాయని ఆయన తెలిపారు.విదేశాల్లో ఉద్యోగాలు పొందిన వారిలో 90 శాతం మంది మహిళలే కావడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు.

ఏపీ కేబినెట్ సమావేశం నవంబర్ 27కి వాయిదా

- నవంబర్ 26న జరగాల్సిన ఏపీ కేబినెట్ సమావేశం 27వ తేదీకి వాయిదా
- 23 పట్టణ స్థానిక సంస్థల పోలింగ్ ఉన్నందున తేదీ మార్పు చేస్తూ నిర్ణయం
- కేబినెట్ నోట్ విడుదల చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్
- హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

అమరావతి,నవంబర్ 23

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 26న జరగాల్సిన ఈ భేటీని నవంబర్ 27వ తేదీకి రీషెడ్యూల్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సంబంధించిన మార్పులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయిప్రసాద్ సోమవారం ఒక అధికారిక కేబినెట్ నోట్ ద్వారా వెల్లడించారు.రాష్ట్రంలోని 23 పట్టణ స్థానిక సంస్థలకు (అర్బన్ లోకల్ బాడీస్) సంబంధించి నవంబర్ 26వ తేదీన పోలింగ్ జరగనుంది. ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆ రోజున ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఆ ప్రక్రియలో నిమగ్నమై ఉండే అవకాశం ఉండటంతో, కేబినెట్ సమావేశాన్ని ఆ మరుసటి రోజు (నవంబర్ 27న) నిర్వహించాలని నిర్ణయించారు.ఈ మంత్రివర్గ సమావేశాన్ని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించనున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అందుబాటులో ఉండే మంత్రులు నేరుగా భేటీకి హాజరుకావాల్సి ఉంటుంది.



ఏపీలో మూడో విడత పంచాయతీ పోరు..

- ఏపీలో మూడో విడత పంచాయతీ ఎన్నికలకు భారీగా నామినేషన్లు
- రెండు రోజుల్లోనే 16,505 సర్పంచ్ నామినేషన్లు దాఖలు
- మొదటి విడత ఎన్నికల్లో 758 మంది సర్పంచ్‌లు ఏకగ్రీవం

హైదరాబాద్,

ఏపీలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ జోరుగా సాగుతోంది. మూడో విడత ఎన్నికల కోసం నామినేషన్ల పర్వం ఊపందుకుంది. తొలి రెండు రోజుల్లోనే సర్పంచ్ పదవుల కోసం ఏకంగా 16,505 నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం 46 రెవెన్యూ డివిజన్లు, 214 మండలాల పరిధిలోని 4,244 గ్రామ పంచాయతీలకు మూడో విడతలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే.నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఈ నెల 21న 4,929 నామినేషన్లు రాగా, రెండో రోజైన నిన్న ఆ సంఖ్య ఒక్కసారిగా పెరిగి 11,576కు చేరింది.



GENERAL జనరల్

మన ప్రజాశక్తి తెలుగు దినపత్రిక www.ManaPrajasakti.com తెలంగాణ ఆంధ్రప్రదేశ్

అత్యాధునిక, క్లిష్ట శస్త్రచికిత్సలకు చిరునామాగా పాల్వంచ సీహెచ్‌సీ

వైద్య నైపుణ్యానికి నిలువుటద్దం.. మోకాలి మార్పిడిలో పాల్వంచ సీహెచ్‌సీ హ్యాట్రిక్

పాల్వంచ మన ప్రజాశక్తి:

ప్రభుత్వ వైద్యరంగంలో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు చేరువ చేయడంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరోసారి ప్రత్యేకతను చాటుకుంది. అనేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించేందుకు వైద్యులు సైతం వెనుకాడే అత్యంత నైపుణ్యం అవసరమైన మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) వైద్య బృందం వరుసగా విజయవంతంగా నిర్వహిస్తోంది. ఇప్పటికే రెండు శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేయగా, తాజాగా మూడో కేసును కూడా విజయవంతంగా నిర్వహించి హ్యాట్రిక్ సాధించింది. ఈ తరహా వినూత్న వైద్య సేవలకు గతంలోనే ఆసుపత్రికి రాష్ట్రస్థాయి అవార్డు లభించడం విశేషం.

కొత్తగూడెంలోని రామాంజనేయ కాలనీకి చెందిన కటికల నాగేంద్రమ్మ (60) గత రెండేళ్లుగా కుడి మోకాలి తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నారు. ఆమెకు పాల్వంచ సీహెచ్‌సీలో టోటల్ నీ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సను ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వరుణ్ కుమార్ విజయవంతంగా నిర్వహించారు. అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ రామ్ ప్రసాద్ అనస్థీషియా సేవలు అందించారు. ఆర్ఎంఓ డాక్టర్ సోమరాజు దొర సమన్వయం, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. ముక్కంటేశ్వరరావు పర్యవేక్షణలో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది.

ఇదే ఆసుపత్రిలో ఇటీవల మరో క్లిష్టమైన హైరిస్క్ గర్భిణీ కేసును కూడా వైద్య బృందం సమర్థవంతంగా నిర్వహించి తల్లీబిడ్డ ఇద్దరినీ క్షేమంగా కాపాడింది. అత్యవసర పరిస్థితుల్లోనూ వైద్య నైపుణ్యం, సమయస్ఫూర్తితో చికిత్స అందించి సురక్షిత ప్రసవం చేయడం ఆసుపత్రిలో అందుతున్న నాణ్యమైన వైద్య సేవలకు మరో నిదర్శనంగా నిలిచింది. ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలతో పాటు గైనకాలజీ విభాగంలోనూ క్లిష్టమైన కేసులను విజయవంతంగా నిర్వహించడం పాల్వంచ సీహెచ్‌సీ వైద్య బృందం సామర్థ్యాన్ని చాటుతోంది.





ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. ముక్కంటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పనిచేస్తున్న అంకితభావం కలిగిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగుల సమష్టి కృషి వల్లే ఇలాంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించగలుగుతున్నామని తెలిపారు. వైద్య బృందం నిబద్ధత, సేవాభావమే ఆసుపత్రి సాధిస్తున్న విజయాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు.

డీసీహెచ్ఎస్ డాక్టర్ రవి బాబు మాట్లాడుతూ.. సీహెచ్‌సీ స్థాయిలోనే ఇంతటి అత్యున్నత నైపుణ్యం అవసరమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది అంకితభావానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ వైద్య బృందాలు సమర్థవంతంగా పనిచేస్తే పేద ప్రజలకు కూడా అత్యాధునిక వైద్య సేవలు అందించవచ్చని పాల్వంచ సీహెచ్‌సీ నిరూపిస్తోందని ప్రశంసించారు. ఇదే మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను ప్రైవేటు ఆసుపత్రిలో చేయించుకుంటే సుమారు రూ.1.50 లక్షల వరకు ఖర్చయ్యేదని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స అందడం ద్వారా రోగికి భారీ ఆర్థిక భారం తప్పిందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న పాల్వంచ సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందిని అభినందించారు.నమ్మకంతో వచ్చాం.. కుటుంబ సభ్యులు: గతంలో ఇదే ఆసుపత్రిలో నిర్వహించిన మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం కావడం, వైద్యులపై నమ్మకం కలగడంతో తమ కుటుంబ సభ్యురాలికి కూడా ఇక్కడే శస్త్రచికిత్స చేయించుకోవాలని నిర్ణయించుకున్నామని రోగి కుటుంబ సభ్యులు తెలిపారు. తమకు నాణ్యమైన వైద్య సేవలు అందించిన పాల్వంచ ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని నిరూపిస్తూ, ప్రజల్లో ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకాన్ని మరింత పెంచేలా పాల్వంచ సీహెచ్‌సీ వైద్య బృందం చేస్తున్న కృషి అభినందనీయమని ప్రజలు కొనియాడారు.

మంజీరా, నక్క వాగులను పరిశ్రమల కాలుష్యం నుండి కాపాడాలి



- మంజీరా కాలుష్యానికి కారణమైన కంపెనీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- మంజీరా కాలుష్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న పీసీబీ అధికారులను సస్పెండ్ చేయాలి



సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు పీసీబీ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా... వినతి

సంగారెడ్డి, ప్రజాశక్తి నవంబర్ 23:

మంజీరా , నక్క వాగులను కాలుష్యం నుండి కాపాడాలని, నది కాలుష్యానికి కారణమైన పరిశ్రమలపై కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ డిమాండ్ చేశారు.పీసీబీ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. అనంతరం అధికారులకు వినతి పత్రం ఇయ్యడం జరిగింది.

ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ జిల్లాకు త్రాగు, సాగు నీరు అందిస్తున్న మంజీరా నదిని కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి మెదక్,సిద్దిపేట,నిజాంబాద్, హైదరాబాదుకు తాగునీళ్లు అందిస్తూ ఎడపాయల దేవస్థానాన్ని కూడా మంచినీళ్లు అందిస్తున్న మంజీరా నదిని కలుషితం చేస్తున్న కెమికల్ పరిశ్రమల పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కాలుష్యం అరికట్టాలని డిమాండ్ చేశారు . చౌటకూరు మండలం వెండికోలు, లింగంపల్లి,కోర్పోలు, తదితరు గ్రామాలలో నక్క వాగు యొక్క కాలుష్య జలాలు ఇక్కడున్న ప్రజలకు రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చుట్టుపక్కల దుర్వాసన వస్తుందన్నారు. చేపలు, జీవరాసులు చనిపోతున్నాయి. తాగడానికి నీళ్లు సరిగా రావడం లేదు. పంటలు నాశనం అవుతున్నాయన్నారు. గతంలో మంజీరా లో ఈ కాలుష్యం వలన 15 నుండి 20 క్వింటాలకు పైన చేపలు కూడా చనిపోయాయనీ తెలిపారు. అయినా ఏ ఒక్క పరిశ్రమ మీద ఇప్పటిదాకా చర్యలు తీసుకోవడం లేదు. తక్షణమే నక్క వాగు,మంజీరా నది కాలుష్యానికి కారణమైన కాలుష్యకర కంపెనీలపైన తక్షణమే చర్యలు తీసుకోని మంజీరా నదిని కాపాడాలని డిమాండ్ చేశారు .మంజీరా కాలుష్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న పీసీబీ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.కాలుష్యం అరికట్టని యెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యం.నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు డి.విద్యా సాగర్, నాయకులు అశోక్, నర్సింలు, అర్జున్, సాయిలు తదితరులు పాల్గొన్నారు

వసతి గృహ కమిటీ ఏర్పాటు అప్రజాస్వామికం

నిబంధనలకు విరుద్ధంగా కమిటీని ప్రకటించారు.. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి

నల్లగొండ, నవంబర్ 23 (మన ప్రజాశక్తి):

విశ్వబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహ నిర్వహణ కమిటీ ఎన్నికైనట్లు పత్రికల్లో వచ్చిన ప్రకటన అవాస్తవమని, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం నాలుగు గోడల మధ్య కమిటీని ఏర్పాటు చేసుకున్నారని వసతి గృహ మాజీ ఉపాధ్యక్షుడు రథం వెంకటరత్నాచారి ఆరోపించారు. ఈ మేరకు వసతి గృహంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కమిటీ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో నూతన కమిటీ ఏర్పాటుకు ముందుగా సభ్యులందరితో సాధారణ సభ నిర్వహించాలని తెలిపారు. సభ్యుల సమక్షంలో ఎన్నికల నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, పారదర్శకంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపాల్సి ఉండగా, నిబంధనలను పక్కనపెట్టి ఏడాది కాలానికి పూర్తిస్థాయి కమిటీని ప్రకటించడం నియమావళికి విరుద్ధమని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించని ఈ కమిటీ చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. ఎంతోమంది త్యాగాలు, కృషితో నిర్మితమైన వసతి గృహాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొందరు తమ ఆధీనంలో ఉంచుకోవాలని చూడటం సరికాదన్నారు. త్వరలో సభ్యులందరితో చర్చించి, నియమావళికి అనుగుణంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వసతి గృహ మాజీ ప్రధాన కార్యదర్శి కొండోజు పుల్లయ్యచారి తెలిపారు. విశ్వబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహం స్వతంత్ర, స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ అని, దాని నిర్వహణ, ఆస్తులు, పరిపాలనా వ్యవహారాల్లో ఇతర సంఘాలకు నేరుగా జోక్యం చేసుకునే అధికారం లేదని సమావేశంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సేవా సమితి సభ్యులు కటకం వెంకటాచారి, పందిళ్ళపల్లి బ్రహ్మచారి, జిల్లా విశ్వబ్రాహ్మణ--విశ్వకర్మ ఐక్య సంఘం అధ్యక్షుడు చొల్లేటి లక్ష్మణ్, పట్టణ మనుమయ సంఘం అధ్యక్షుడు సల్వోజు సైదాచారి, సహాయ కార్యదర్శి బత్తినోజు సైదాచారి, పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు చొల్లేటి హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి తాడూరి చర్మయ్యచారి, కోశాధికారి కటకం మహేష్, రాష్ట్ర స్వర్ణకార సంఘం మాజీ ఉపాధ్యక్షుడు కన్నెకంటి సత్యం, విశ్వబ్రాహ్మణ పురోహితుడు శీలోజు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ముసలిమడుగులో టీడీపీ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్.



మల్లయ్య గెలుపే లక్ష్యంగా టీడీపీ శ్రేణుల ఐక్య కార్యాచరణ.

నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-

నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు, తలముడిపి మహేష్ నాయుడు ఆధ్వర్యంలో ముసలిమడుగు గ్రామం నుంచి కుమ్మరి మల్లయ్య సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు మున్నా, ముతాలిఫ్, ఆదాం, గఫూర్, వెంకటేశ్వర్లు, పుల్లయ్య, మదర్ సబ్, గారి గఫూర్, చాంద్ భాషా, నాగరాజుతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు భారీ సంఖ్యలో హాజరై మల్లయ్యకు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా అభ్యర్థి మల్లికార్జున మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, గ్రామంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తుల భారీ హాజరుతో నామినేషన్ కార్యక్రమం సందడిగా సాగింది. దీంతో ముసలిమడుగు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

కోనేటమ్మపల్లె పంచాయతీ పోరులో హెప్సిబా.



టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు. మద్దతుగా తరలివచ్చిన పార్టీ నేతలు.

నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-

నందికొట్కూరు మండలం కోనేటమ్మపల్లె గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్ పదవికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా హెప్సిబా నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు.దీంతో గ్రామంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.గ్రామ ప్రజల ఆదరణతో ఎన్నికల్లో విజయం సాధించి అభివృద్ధికి బాటలు వేయాలనే లక్ష్యంతో ఆమె బరిలోకి దిగారు.హెప్సిబా నామినేషన్ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై తమ సంఘీభావాన్ని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పోతుల రఘురామి రెడ్డి, మాజీ సర్పంచ్ దామోదర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవి చేపట్టిన వెంటనే ప్రజాక్షేత్రంలోకి..

మారుతీనగర్ తాగునీటి కష్టాలకు చెక్ పెట్టేందుకు రంగంలోకి దిగిన 26వ వార్డు కౌన్సిలర్ సునీత కుమారి.



నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-

నందికొట్కూరు పట్టణంలోని 26వ వార్డు మారుతీనగర్ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై నూతన కౌన్సిలర్ సునీత కుమారి తక్షణమే స్పందించారు. ప్రమాణ స్వీకారం చేసి కొన్ని గంటలు కూడా గడవకముందే ప్రజల సమస్యను తన బాధ్యతగా తీసుకుని పరిష్కార చర్యలకు శ్రీకారం చుట్టారు.ప్రజలకు ఇచ్చిన ప్రాధాన్యత మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపిస్తూ బోరు మరమ్మతుల పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. హైడ్రాలిక్ మిషన్ సహాయంతో బోరుకు మరమ్మతులు చేయించడంతో పాటు, దెబ్బతిన్న పాత పైపులను తొలగించి కొత్త పైపులను ఏర్పాటు చేయించారు. దీంతో మారుతీనగర్‌లో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించేలా చర్యలు చేపట్టారు.వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ధారా సుధీర్,రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సూచనల మేరకు,నూతన మున్సిపల్ చైర్మన్ షేక్ ఫాతిమాభి మన్సూర్ ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు.ఈ కార్యక్రమంలో 26వ వార్డు ఇన్‌చార్జి చరణ్ తేజ, 26వ బూత్ ఇన్‌చార్జి రఫీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పదవి అలంకారం కోసం కాదు..

ప్రజల సమస్యలకు పరిష్కారం చూపించడమే లక్ష్యం అనే రీతిలో సునీత కుమారి తొలి అడుగులు వేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలు

నారాయణ సేవ, అన్నదానంతో సేవా కార్యక్రమాలు

నల్లగొండ, నవంబర్ 23 (మన ప్రజాశక్తి)





శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతిని పురస్కరించుకుని సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నారాయణ సేవ, అన్నదాన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొలుత కేఎస్ఆర్ నివాసంలో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాతబస్తీలోని శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శ్రీనివాస్, కేశవ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీధుల్లోని ప్రజలకు, భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నిర్వాహకుడు పున్న విశ్వేశ్వర్ మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అత్యున్నత సేవ అని పేర్కొన్నారు. ప్రతి మనిషిలో భగవంతుడిని దర్శిస్తూ చేసే సేవే నారాయణ సేవ అని తెలిపారు. సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని ఏటా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన శ్రీనివాస్, కేశవ్‌లకు సత్యసాయి బాబా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, వారు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బకరం శ్రీనివాస్, ఆటో నర్సింహా, మదన్ మోహన్, కృష్ణ బాబు, సందీప్ రెడ్డి, నాంపెల్లి మురళయ్య, కె. శ్రీనివాస్, పోలీస్ నరసింహ, జగదీష్, జి. మనోహర్, కోట్ల సైదులు, నాగేశ్వరరావు, నాగరాజు, శివ, పద్మశ్రీ, శైలజ, కంచర్ల విజయ, శోభ, కజ్జం సరోజ, కళావతి, శకుంతల, శ్రీదేవి, కె. పార్వతి, బి. పార్వతి, కె. పద్మావతి, నిఖిల, దీప తదితరులు పాల్గొన్నారు. భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, అన్నప్రసాదం స్వీకరించిన ప్రజలు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



ఎస్పీ నరసింహ భరోసా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి - బాధితులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ

సూర్యాపేట, ప్రజాశక్తి నవంబర్ 23 :

ప్రజల ఫిర్యాదులపై పోలీసులు వెంటనే స్పందించాలని, బాధితులకు త్వరగా న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అధికారులను ఆదేశించారు.

సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఒక్కో వినతిని పరిశీలించి, సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.

ప్రజలకు అవసరమైన సేవలు, తక్షణ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు. ప్రజా రక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు.

గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. సమస్యలు వచ్చినప్పుడు దాడులకు పాల్పడకుండా, పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్ట పరిధిలోనే పరిష్కరించుకోవాలన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్

డిసెంబర్ 11 నుంచి 22 వరకు జాతీయ స్థాయి పోటీలు - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, ప్రజాశక్తి నవంబర్ 23 :

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తెలంగాణ రాష్ట్రం వేదిక కావడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు జరిగే ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు సంబంధించి కెఐవైజి – 2026 అధికారిక లోగో, మస్కట్, సెల్ఫీ స్టాండ్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియా పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. తమలోని క్రీడా ప్రతిభను గుర్తించి, కష్టపడి సాధన చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. ప్రేమ్ రాజ్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈఓ శిరీష, డిఐఈఓ సులోచన రాణి, డిఎస్డిఓ లత తో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సిపిఐ ఆధ్వర్యంలో జరిగే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయండి

సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయ నాయుడు విజ్ఞప్తి

నేరేడుచర్ల:- నవంబర్ 23 మన ప్రజాశక్తి

దేశవ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కారం కొరకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో జరగనున్న ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు సిపిఐ ఆధ్వర్యంలో జరిగే ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు.

సోమవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో సిపిఐ కార్యాలయం ప్రజా భవన్ లో పాత్రికేయులతో మాట్లాడుతూ.... ప్రజా సమస్యలనే రాజకీయ అస్త్రాలుగా మలచుకొని దేశవ్యాప్త ఆందోళనకు పార్టీ సిద్ధమైందని దేశంలో బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ ఒకటవ తేదీన తెలంగాణ వ్యాపితంగా జైల్ బరో రైలురోకో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు

ఇచ్చిన హామీ మేరకు బిజెపి ప్రభుత్వం పేదల కోసం దేశవ్యాప్తంగా మూడు కోట్ల ఇండ్లు నిర్మించాలని ఉచిత రేషన్ పథకం అమలు చేయాలని నిత్యావసర వస్తువుల ధరలు అదుపులోకి తేవాలని 70 ఏళ్ళు దాటిన వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ అమలు చేయాలని ముద్ర రుణపరిమితి 20 లక్షలకు పెంచాలని సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలనే ప్రధాన డిమాండ్లతో జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అలాగే డిసెంబర్ రెండవ తేదీన రైలు రోకో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎల్ నినో పరిస్థితుల్లో నెలకొన్న కరువు సహాయక చర్యల్లో భాగంగా 50 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని అదేవిధంగా విద్యారంగంలో కాషాయీకరణ నువ్వు వ్యతిరేకిస్తూ సిపిఐ అనుబంధ సంఘం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 7న చలో ఢిల్లీ



కార్యక్రమం నిర్వహిస్తున్నామని అలాగే ఈనెల 26వ తేదీని రాజ్యాంగ దినోత్సవం గా నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా సభలు సమావేశాలు నిర్వహించి ప్రజలకు రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలియజేశారు

ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు చిలకరాజు శ్రీను సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్ బండి శ్రీనివాస్ ఉన్నారు.

డబుల్ బెడ్ రూమ్‌ల బోగస్ పట్టాల దందా

- ఇది దొంగతనం కాదు... ఇది ప్రభుత్వానికే సవాల్..!- అధికారులు వేసిన సీల్ తాళాన్ని పగలగొట్టి కబ్జా చేసిన బి-బ్లాక్ జి-7 ఇల్లు... సాక్ష్యంగా నిలిచిన ఎండిన మామిడి తోరణం- కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రభుత్వానికి సవాల్... సీజ్ చేసిన ఇంటినే కొల్లగొట్టారు!- మరో రెండు బెడ్ రూమ్ లను ఆధీనంలోకి తీసుకోలేని అధికారులు- ఇది పేద ప్రజల ఆవేదన! అధికారులు ఇప్పటికైనా కళ్ళు తెరుస్తారా? కబ్జాదారుల అరాచకానికి చరమగీతం పాడతారా...?



బోడుప్పల్, నవంబర్ 23, మన ప్రజాశక్తి

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ – 10 పరిధిలోని రాజీవ్ నగర్ 9 డబల్ బెడ్ రూమ్‌లలో దారుణం జరిగింది. మరో రెండు బెడ్ రూమ్ లను ఆధీనంలోకి తీసుకోలేని అధికారులు(ప్రభుత్వం సీజ్ చేసిన ఇంటి తాళాన్నే పగలగొట్టి, పట్టపగలు కబ్జాదారులు ఆ ఇంటిని ఆధీనంలోకి తీసుకున్నారు. అధికారులంటే లెక్క లేదు, చట్టం అంటే భయం లేదు అన్నట్లుగా వీరి వ్యవహారం సాగుతోంది.అసలు కథ ఇది. పేదల కోసం ప్రభుత్వం కట్టిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను కొంతమంది తమ సొంత ఆస్తిగా మార్చుకున్నారు. బోగస్ పట్టా సర్టిఫికెట్లు సృష్టించి, అమాయక ప్రజలకు ఒక్కో ఇంటిని 10 నుండి 15 లక్షల రూపాయలకు అమ్మేసుకున్నారు. ఇలా కోట్ల రూపాయలు దండుకున్నారు.ప్రజలు రెవెన్యూ అధికారులకు, జిల్లా కలెక్టర్ గారికి ఫిర్యాదు చేయడంతో అప్పట్లో మేడిపల్లి అధికారులు రంగంలోకి దిగి ఆ ఇళ్లను సీజ్ చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

మరోసారి సీజ్ అంటే లెక్కలేదు... మళ్ళీ అమ్మకం!

కానీ ఆ సీజ్ ఎన్ని రోజులు నిలిచింది? కొద్దిరోజులకే రాజకీయ



నాయకుల అండతో ఇక్కడే నివసించే కొంతమంది ముఠాగా తయారై, సీజ్ చేసిన ఇళ్ల తాళాలు పగలగొట్టి మరోసారి అమ్మడం మొదలుపెట్టారు.మళ్ళీ ఫిర్యాదులు వెళ్ళాయి. మళ్ళీ అధికారులు వచ్చారు. మళ్ళీ సీజ్ చేశారు. రెండు ఇళ్లలో ఉన్న కొనుగోలుదారులను విచారించి వారి పత్రాలు తీసుకున్నారు.కానీ అసలు తప్పు చేసిన వారిపై ఏం చర్యలు తీసుకున్నారు..? అమ్మిన వారిపై కేసు లేదు. కొన్న వారిపై కేసు లేదు. బోగస్ పట్టాలు సృష్టించిన వారిపై కేసు లేదు. కేవలం తాళం వేసి వెళ్ళిపోయారు. ఇప్పుడు పెద్ద తప్పు అయింది.

ఆదివారం... అధికారులకు సెలవు... కబ్జాదారులకు పండుగ!



సీజ్ చేసి రెండు నెలలు అవుతోంది. ఈరోజు ఆదివారం, అధికారులకు సెలవు అని తెలుసుకున్న కబ్జాదారులు బి-బ్లాక్ జి-7 ఇంటిపై పడ్డారు. అధికారులు వేసిన సీజ్ తాళాన్ని పగలగొట్టి ఆ రూమును పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారుఇది కేవలం తాళం పగలగొట్టడం కాదు ఇది ప్రభుత్వ సీల్‌ను ధ్వంసం చేయడం. ఇది చట్టాన్ని కాలితో తొక్కడం.

"ప్రజల గుండెల్లో మంట...

పేదవాడికి ఇల్లు లేదు కానీ కబ్జాదారులకు మాత్రం 6 ఇండ్లు ఉన్నాయి, మేము ఫిర్యాదు చేస్తే సీజ్ చేస్తారు, వాళ్లు తాళం పల్లగొట్టితే చూస్తూ ఊరుకుంటారా..? ఈ మూఠా వెనుక ఎవరున్నారు...? కాంగ్రెస్ పార్టీ రాజకీయ నాయకుడు వీరికి అండగా ఉన్నాడు...?

స్థానికుల తుది హెచ్చరిక:-

1. జి-7 తాళం పగలగొట్టిన వారిని అరెస్ట్ చేయాలి.
2. బోగస్ పట్టాలు సృష్టించిన ముఠా మొత్తంపై క్రిమినల్ కేసు, రౌడీషీట్ పెట్టాలి.
3. అర్హులైన పేదలకు వెంటనే ఇళ్లు కేటాయించి, పోలీస్ భద్రత పెట్టాలి.

విషాద కుటుంబాలకు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పరామర్శ

వసంతమ్మ టీచర్, వైభవ్ మృతికి ఘన నివాళులు.

నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-



రెండు కుటుంబాల్లో చోటుచేసుకున్న విషాద ఘటనలు వైసీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని కలచివేశాయి.విశ్రాంత ఉపాధ్యాయురాలు మేస వసంతమ్మ,కొనేటమ్మపల్లె గ్రామ వైసీపీ నాయకుడు అచ్చన్న కుమారుడు వైభవ్ మృతి వార్త తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి సంతాపం వ్యక్తం చేశారు.అనారోగ్యంతో మృతి చెందిన వసంతమ్మ టీచర్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను



పరామర్శించి, ఈ కష్ట సమయంలో వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.అదేవిధంగా గుండెపోటుతో మృతి చెందిన వైభవ్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తండ్రి అచ్చన్నతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వసంతమ్మ టీచర్, వైభవ్ మృతులు ఆయా కుటుంబాలకు తీరని లోటని పేర్కొంటూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆకాంక్షించారు.

GENERAL జనరల్

మన ప్రజాశక్తి తెలుగు దినపత్రిక ప్రజాగళమే.. ఊపిరి www.ManaPrajasakti.com తెలంగాణ ఆంధ్రప్రదేశ్

నందికొట్కూరు మున్సిపాలిటీలో వైసీపీ జైత్రయాత్ర



ఇక అభివృద్ధి పరుగులు తీయాలి!
23 వార్డుల విజయంతో పాలనా పగ్గాలు.
నూతన పాలకవర్గానికి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, డాక్టర్ దారా సుధీర్ అభినందనలు.
ప్రజా తీర్పును గౌరవిస్తూ.. పట్టణ ప్రగతికి



బాటలు వేయాలని పిలుపు.

నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-

నందికొట్కూరు మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ తన బలాన్ని మరోసారి నిరూపించుకుంది.మొత్తం 32 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 23 స్థానాలను కైవసం చేసుకుని మున్సిపల్ పాలనపై పట్టు సాధించింది. టీడీపీ 9 వార్డులకే పరిమితం కాగా, స్పష్టమైన మెజారిటీతో వైసీపీ నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ప్రారంభమైన ఈ కొత్త పాలనా అధ్యాయం పట్టణ అభివృద్ధికి ఎలాంటి దిశానిర్దేశం చేస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.సోమవారం మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో నూతన చైర్‌పర్సన్ షేక్ ఫాతీమా బీ మన్సూర్ అహ్మద్, కౌన్సిలర్లు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జరిగిన వైస్ చైర్మన్ ఎన్నికలో 8వ వార్డు కౌన్సిలర్ మంగలి స్వాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో నందికొట్కూరు మున్సిపాలిటీలో నూతన పాలకవర్గం అధికారికంగా బాధ్యతలు చేపట్టింది.

విజయం ఒక బాధ్యత.. అభివృద్ధి అసలైన లక్ష్యం!

నూతన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వైసీపీ రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం నూతన పాలకవర్గం ముందున్న ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.పట్టణంలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, తాగునీటి ఇబ్బందులు, అధ్వానంగా ఉన్న రహదారులు, అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపాలని సూచించారు. వార్డులవారీగా ప్రజల సమస్యలను తెలుసుకుని, కౌన్సిలర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలన సాగించాలని ఆకాంక్షించారు.

రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమమే ధ్యేయం కావాలి!

మున్సిపాలిటీలో మెజారిటీ సాధించడం వైసీపీకి రాజకీయంగా బలాన్ని ఇచ్చినా, ఆ విజయాన్ని ప్రజలకు కనిపించే అభివృద్ధిగా మార్చడం నూతన పాలకవర్గానికి అసలైన సవాలని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రతి వార్డులో సమాన అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం అత్యంత అవసరం. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన





హామీలను కార్యరూపంలోకి తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైంది.ప్రజల ఓటుతో లభించిన అధికారాన్ని ప్రజల కోసమే వినియోగిస్తూ నందికొట్కూరు మున్సిపాలిటీని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దాలని బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, డాక్టర్ దారా సుధీర్ ఆకాంక్షించారు. ఎన్నికల విజయంతో మొదలైన ప్రస్థానం అభివృద్ధి విజయంగా నిలవాలని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరు గ్యారంటీలు - ఆరు మోసాలు

పట్టభద్రులను ముంచేసిన కాంగ్రెస్ కు ఓటుతోనే బుద్ధి చెప్పాలి - పుట్ట కిషోర్

సూర్యాపేట, ప్రజాశక్తి నవంబర్ 23 :

మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదేశాల మేరకు, ఉమ్మడి నల్గొండ – ఖమ్మం – వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం సూర్యాపేట పట్టణంలోని 17వ వార్డులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల సమావేశం ఘనంగా నిర్వహించారు.బీఆర్ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కీసర వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో, 17వ వార్డు ఇన్‌చార్జి నరేడ్ల మల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఎన్నికల వార్డు ఇన్‌చార్జి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు గౌడ్ హాజరయ్యారుఈ సందర్భంగా పుట్ట కిషోర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటుగా ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, నేడు అన్ని వర్గాల ప్రజలను గాలికి వదిలేసిందని విమర్శించారు.జాబ్ క్యాలెండర్ ఏది ? నిరుద్యోగ భృతి ఏది ? అని ప్రశ్నిస్తూ, హామీలను తుంగలో తొక్కి పట్టభద్రులను తీవ్ర నిరాశకు



గురిచేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో అరాచక, అవినీతి పాలన కొనసాగుతోందని, అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యావంతులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును ఆయుధంగా మార్చుకుని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.కీసర వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, “ఒక ఓటు ఎంత విలువైనదో జగదీష్ రెడ్డి కి ఓటు వేసిన తర్వాతే ప్రజలకు అర్థమైంది. జగదీష్ రెడ్డి గారికి ముందు – జగదీష్ రెడ్డి తర్వాత అని చెప్పుకునే విధంగా సూర్యాపేట అభివృద్ధి చెందింది” అని తెలిపారు.రీకాల్ వ్యవస్థ లేని మన ప్రజాస్వామ్యంలో పట్టభద్రులు వేసే ఓటే రీకాల్ లాగా పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో 74 నియోజకవర్గాల పరిధిలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయని, పట్టభద్రులు ఇచ్చే తీర్పు భవిష్యత్తు ఎన్నికలకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ వేల్పుల సుధాకర్, కంకణాల శ్రీను, రహీమ్ భాయ్, ఆదిమల్ల వేణు, సత్తూరి రాము, బిట్టు శివ, అక్బర్, లాజర్, కార్యకర్తలు, పట్టభద్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కల్పించాలి

ఇండ్ల స్థలాల సాధనలో జర్నలిస్టులకు అండగా- ఎంపీ వద్దిరాజు

ఖమ్మం,ప్రజాశక్తి 23 :

ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్న ఖమ్మం జర్నలిస్టులకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సంపూర్ణ మద్దతు ప్రకటించారు.దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఇండ్ల స్థలాలను వెంటనే కేటాయించాల్సిందిగా కోరుతూ తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయుడబ్ల్యూజే), తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఏఫ్)ల ఆధ్వర్యాన ఖమ్మం జర్నలిస్టులు పోరుబాట పట్టిన విషయం తెలిసిందే.ఇందులో భాగంగా మయూరి సెంటర్ సమీపాన ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ,తమకు ఇండ్ల స్థలాలు కేటాయించాలన్న జర్నలిస్టుల డిమాండ్ న్యాయమైనది,ధర్మమైనద న్నారు.ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచి ప్రజాస్వామ్యానికి నాలుగవ స్థంభంగా పిలువబడుతున్న జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం కొన్ని రోజులుగా రోడ్లపైకి వచ్చి పోరాడుతున్నారన్నారు.మంత్రులు, జిల్లా అధికార యంత్రాంగానికి పలుమార్లు



విన్నవించుకున్నా కూడా ఫలితం కానరాకపోవడంతో ప్రత్యక్ష పోరుకు దిగారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.చాలీచాలని జీతాలతో ఉద్యోగ భద్రత లేక కుటుంబాన్ని పోషించుకునేందుకు, పిల్లల్ని చదివించడానికి జర్నలిస్టులు ఇబ్బందులుపడుతున్నారని వివరించారు.జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రభుత్వంలో కీలక భూమిక పోషిస్తున్న ముగ్గురు మంత్రులు వెంటనే సానుకూలంగా స్పందించి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని ఎంపీ వద్దిరాజు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు, గౌరవ సలహాదారు పారా నాగేశ్వరరావు, అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొని సంతకాలు చేశారు.సంతకాల సేకరణ కార్యక్రమం టీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవికుమార్,ఐజేయు నాయకులు సాంబశివరావు తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటైంది.

డిజిటల్ విద్యకు కలెక్టర్ ప్రోత్సాహం

భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాశక్తి నవంబర్ 23:

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, ఉపాధ్యాయుల బోధనా విధానం, డిజిటల్ విద్యా వనరుల వినియోగాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ పాఠ్యాంశాలపై వారి అవగాహనను పరీక్షించారు. పదో తరగతి సామాజిక శాస్త్రంలో ప్రపంచీకరణ, సరళీకరణ, బహుళజాతి సంస్థలు, ఆహార భద్రత వంటి అంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఆంగ్లంలో ఉన్న నిర్వచనాలను చెప్పడంతోపాటు వాటి అర్థాలను తెలుగులో వివరించాలని సూచించారు. పాఠ్యాంశాలను కేవలం కంఠస్థం చేయకుండా, నిత్యజీవితంలో కనిపించే ఉదాహరణలతో అనుసంధానించుకొని అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఉపాధ్యాయులు మైండ్ మ్యాపింగ్ విధానం ద్వారా పాఠ్యాంశాలను బోధిస్తున్న తీరును పరిశీలించారు. ముఖ్యమైన అంశాలను గుర్తించి విద్యార్థులతో నోట్స్ రాయించడం వంటి పద్ధతులను గమనించారు. ఆంగ్ల మాధ్యమంలో ఉన్న ప్రశ్నలను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా అవసరమైన చోట తెలుగులోనూ వివరించాలని, ప్రతి అంశంపై సంపూర్ణ అవగాహన కల్పించేలా బోధన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

రాంపూర్ గ్రామ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన పాఠ్యాంశంపై విద్యార్థులను ప్రశ్నిస్తూ వ్యవసాయం, వ్యవసాయేతర కార్యకలాపాలు, పంటలు, తలసరి ఆదాయం, విద్య, రవాణా వంటి అంశాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఉన్న రాంపూర్ గ్రామ వ్యవసాయ విధానాలను బూర్గంపాడు ప్రాంతంలోని వరి, మిరప, పత్తి, పామాయిల్ పంటలతో పోల్చి వివరించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులు, వ్యవసాయ, వ్యవసాయేతర ఉపాధి అవకాశాలను గుర్తించి వాటిని సమర్థంగా వినియోగించుకునేలా విద్యార్థులకు అసైన్‌మెంట్లు ఇవ్వాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములయ్యేలా ప్రోత్సహించాలని తెలిపారు.అనంతరం ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి డిజిటల్ అభ్యసన వేదికల వినియోగంపై ఉపాధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమ విద్యార్థులను ఖాన్ అకాడమీలో నమోదు చేసినట్లు ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు ప్రతిరోజూ కనీసం 20 నిమిషాలు ఈ వేదికపై అభ్యసనానికి కేటాయించేలా, నిర్దేశించిన అభ్యసన లక్ష్యాలు, క్విజ్‌లను పూర్తి చేసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.పాఠశాలలో అందుబాటులో ఉన్న ఏడు ల్యాప్‌టాప్‌లు, ఆరు కంప్యూటర్ల పనితీరును పరిశీలించారు. పాత కంప్యూటర్లను అవసరానికి అనుగుణంగా నవీకరించుకోవాలని సూచించారు. డిజిటల్ పరికరాలు కేవలం పాఠశాలలో అందుబాటులో ఉండటమే కాకుండా, విద్యార్థుల అభ్యసనానికి ప్రతిరోజూ ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ తనిఖీలో బూర్గంపాడు డిప్యూటీ తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారి ఏదు సింహరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో
‘ట్రాఫిక్ రద్దీ ఛార్జీలు’?

హైదరాబాద్‌లో ట్రాఫిక్ తగ్గించేందుకు కన్జెషన్ ఛార్జ్ ప్రతిపాదన
రుసుము చెల్లించేందుకు సిద్ధమన్న వాహనదారులు
వసూలైన నిధులను ప్రజా రవాణా మెరుగుదలకే వాడాలని సూచన
ఐటీ కారిడార్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని సిఫార్సు

హైదరాబాద్ నగరంలో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ‘కన్జెషన్ ఛార్జ్’ (రద్దీ రుసుము) అమలు చేయడం ఒక ఉత్తమ మార్గమని బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ పరిశోధకులు సూచిస్తున్నారు. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు, వసూలు చేసిన రుసుమును ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుదలకు వెచ్చిస్తే, నగర వాహనదారులు ఈ రుసుమును చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారని వారి అధ్యయనంలో వెల్లడైంది.బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌కు చెందిన ట్రాన్స్‌పోర్టేషన్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ల్యాబ్, కార్డిఫ్ యూనివర్సిటీ, కింగ్ ఫాహద్ యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ మినరల్స్ సంయుక్తంగా భారత ప్రభుత్వ నిధులతో ఈ పరిశోధనను చేపట్టాయి. ఇందులో భాగంగా 435 మంది కారు ప్రయాణికుల అభిప్రాయాలను సేకరించగా, ప్రయాణ సమయం అదా కావడమే తమకు అత్యంత ప్రధానమైన ప్రయోజనమని అత్యధికులు అభిప్రాయపడ్డారు.పెరుగుతున్న వాహనాల సంఖ్యతో పాటు రోడ్ల వెడల్పులో వ్యత్యాసాలు, పాదచారుల సౌకర్యాల కొరత, రహదారులపై పార్కింగ్, అశాస్త్రీయ జంక్షన్ల వల్లే ట్రాఫిక్ సమస్య జటిలమవుతోందని ప్రొఫెసర్ ప్రశాంత సాహు విశ్లేషించారు. ఐటీ కారిడార్ వంటి అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని పరిశోధకులు సిఫార్సు చేశారు. హైటెక్ సిటీలోని సైబర్ టవర్స్ వద్ద గంటకు సగటున 10 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని, వీటిలో అత్యధిక శాతం సింగిల్ ఆక్యుపెన్సీ వాహనాలేనని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



GENERAL జనరల్

మన ప్రజాశక్తి తెలుగు దినపత్రిక
ప్రజాగళమే.. ఊపిరి
www.ManaPrajasakti.com
తెలంగాణ ఆంధ్రప్రదేశ్

ప్రజావాణి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి

- ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు తప్పవు
కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, ప్రజాశక్తి నవంబర్ 23 :

ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.

సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.

ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రతి అధికారి తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.



మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 19వ తేదీ నుండి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలోని ప్రతి కుటుంబం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలు, రెవెన్యూకి సంబంధించి 41, డిఆర్డిఓ 27, డిపిఓ 7, మున్సిపాలిటీ 6, డిడబ్ల్యుఓ 5, మిగిలిన 28 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవని, మొత్తం 114 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిడబ్ల్యుఓ నరసింహారావు, డిపిఓ యాదగిరి, డిఎస్ఓ మోహన్ బాబు, డిఐఈఓ సులోచన రాణి, డివైఎస్ఓ వెంకటరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఉపేందర్, జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.



మిర్యాలగూడలో ఆధ్యాత్మిక శోభ..

వైభవంగా సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలు

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ.. భక్తులకు అన్నదాన కార్యక్రమం

మిర్యాలగూడ, నవంబర్ 23 ప్రజాశక్తి :

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకలు మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తుల భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిభావాన్ని చాటాయి. జయంతి వేడుకల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, జ్యోతి ప్రజ్వలనతో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ వేడుకలకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సేవా కార్యక్రమాలతో బాబాకు ఘన నివాళిసత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని ఆలయ





అధ్యక్షుడు ఆదినారాయణ ఆధ్వర్యంలో వార్డు కౌన్సిలర్ చేదుల మీదగా శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సహకారంతో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సేవే మాధవ సేవ అనే సత్యసాయి బాబా సందేశానికి అనుగుణంగా ఈ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ.. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా తన జీవితాంతం మానవసేవ, ఆధ్యాత్మికత, ప్రేమ, కరుణ, సమానత్వం వంటి విలువలను ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. బాబా ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సేవాభావంతో సమాజంలోని పేదలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి భక్తులు, సేవా సమితి సభ్యులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.





విశాఖ మేయర్ ముక్కా శ్రావణిని పరామర్శించిన మంత్రి లోకేశ్

మేయర్ తండ్రి ముత్యాలనాయుడు ఇటీవల మృతి
ఆయన చిత్రపటానికి నివాళులు
పార్టీకి ముత్యాలనాయుడు సేవలను గుర్తుచేసుకున్న లోకేశ్
లోకేశ్ వెంట పలువురు టీడీపీ నేతలు

అమరావతి,నవంబర్ 23,(రియల్ అడ్వైజర్)

విశాఖపట్నం నగర మేయర్ ముక్కా శ్రావణిని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం పరామర్శించారు. శ్రావణి తండ్రి, టీడీపీ సీనియర్ నేత ముక్కా ముత్యాలనాయుడు శుక్రవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, విశాఖలోని ఆమె నివాసానికి వెళ్లిన లోకేశ్.. మేయర్ శ్రావణిని, ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు. కార్పొరేటర్‌గా, విశాఖ జిల్లా పార్టీ బీసీ



విభాగం ఉపాధ్యక్షుడిగా ముత్యాలనాయుడు పార్టీకి, ప్రజలకు అందించిన సేవలను లోకేశ్ గుర్తు చేసుకున్నారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మంత్రి లోకేశ్ వెంట ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు చోడె పట్టాభిరాం, ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ, పెందుర్తి నియోజకవర్గ ఇంఛార్జ్ గండి బాబ్జి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పుచ్చా విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

విజయవాడ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వంగవీటి రాధాకృష్ణ



మొత్తం 86 స్థానాల్లో 76 డివిజన్లు గెలుచుకుని సత్తా చాటిన ఎన్డీయే కూటమి
మేయర్ రాధాకృష్ణ, కార్పొరేటర్లతో ప్రమాణం చేయించిన కలెక్టర్ లక్ష్మీశా
ఎన్నికల్లో 8 డివిజన్లకే పరిమితమైన వైసీపీ

అమరావతి,(రియల్ అడ్వైజర్)

విజయవాడ నగర పాలక సంస్థ (వీఎంసీ) మేయర్‌గా జనసేన పార్టీ నేత వంగవీటి రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారి హోదాలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశా.. నూతన మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణతో ప్రమాణం చేయించారు. మేయర్ ప్రమాణ స్వీకారం పూర్తయిన తర్వాత, నగరంలోని 86 డివిజన్ల నుంచి కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లతో కలెక్టర్ వరుసగా ప్రమాణం చేయించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయవాడ నగర పాలక సంస్థపై ఎన్డీయే కూటమి పూర్తి ఆధిపత్యం సాధించినన సంగతి తెలిసిందే. మొత్తం 86 డివిజన్లలో కూటమి ఏకంగా 76 స్థానాలను కైవసం చేసుకుంది. ఇందులో టీడీపీ 53 డివిజన్లు, జనసేన పార్టీ 19 డివిజన్లు, బీజేపీ 4 డివిజన్లలో విజయం సాధించాయి. ప్రతిపక్ష వైసీపీ 8 డివిజన్లకే పరిమితం కాగా, సీపీఎం ఒకటి, స్వతంత్ర అభ్యర్థి ఒక స్థానంలో గెలుపొందారు. మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం పూర్తి కావడంతో విజయవాడ నగరంలో నూతన పాలకమండలి అధికారికంగా కొలువుదీరినట్లైంది. తదుపరి నిర్వహించే ప్రత్యేక సమావేశంలో కొత్త డిప్యూటీ మేయర్‌ను కార్పొరేటర్లు ఎన్నుకోనున్నారు.

శ్రీ సత్యసాయి బాబా జయంతి ఇకపై

రాష్ట్ర పండుగ



విద్య, వైద్యం, తాగునీటి రంగాల్లో బాబా చేసిన సేవలు చిరస్మరణీయమన్న లోకేశ్
సత్యసాయి చూపిన సేవా మార్గాన్ని భావితరాలకు అందిస్తామని వ్యాఖ్య

అమరావతి,(రియల్ అడ్వైజర్)

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. నవంబర్ 23న సత్యసాయి బాబా జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాయి భక్తులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... "భారతీయ సమాజాన్ని ఆధ్యాత్మికంగా అత్యంత ప్రభావితం చేసి... జాతి సంస్కృతిని దేశ విదేశాలకు చాటి చెప్పిన మహానుభావుడు సత్యసాయి. అంతేకాదు విద్యాలయాలు, ఆసుపత్రులు, తాగునీటి పథకాలను నెలకొల్పి తన సామాజిక సేవాకార్యక్రమాల ద్వారా గొప్ప మానవతావాదిగా ప్రజల హృదయాలలో నిలిచిపోయారు సత్య సాయిబాబా. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా గారి సేవా మార్గాన్ని, బోధనలను భావితరాలకు అందించేందుకు సాయి జయంతిని రాష్ట్ర పండుగగా జరపాలని నిర్ణయించాం. మానవ సేవే పరమావధిగా జీవించిన సాయి బోధనలను ఈ సందర్భంగా స్మరించుకుందాం" అని పేర్కొన్నారు.

చేవెళ్లలో దొంగతనం ఫిర్యాదు చేసిన మహిళ హత్య

అమరావతి,నవంబర్ 23(రియల్ అడ్వైజర్)

తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిందన్న కక్షతో ఓ మహిళను దారుణంగా హత్య చేసిన 19 ఏళ్ల యువకుడిని చేవెళ్ల పోలీసులు 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. సెల్‌ఫోన్ దొంగతనంతో పాటు బ్యాంక్ ఖాతా నుంచి నగదు బదిలీ చేసిన వ్యవహారం ఈ హత్యకు దారితీసింది. నిందితుడి వద్ద నుంచి దొంగిలించిన మొబైల్ ఫోన్‌తో పాటు, హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన కేశవత్ శివ శంకర్ వరప్రసాద్ నాయక్ (19), బాతుల గురువులు అనే వ్యక్తి సెల్‌ఫోన్ దొంగిలించాడు. అనంతరం బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ. 45,000 నగదును తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన గురువులు, పద్మ అనే మహిళతో కలిసి ఈ నెల 21న చేవెళ్ల పోలీసులకు శివపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసే సమయంలో పద్మ కూడా ఉండటంతో శివ ఆమెపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే శనివారం తెల్లవారుజామున చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫరా కాలేజీ ఎదురుగా ఉన్న రేకుల షెడ్డు వద్ద పద్మపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

GENERAL జనరల్

మన ప్రజాశక్తి తెలుగు దినపత్రిక ప్రజాగళమే.. ఊపిరి www.ManaPrajasakti.com తెలంగాణ ఆంధ్రప్రదేశ్

కాంగ్రెస్‌లో ముఠా తగాదాలు లేవు..

ప్రభుత్వంపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదన్న మంత్రి

కొత్త ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి గాంధీ భవన్‌కు వచ్చిన బీఎం సందీప్

మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, తుమ్మలతో ఇన్‌చార్జి విడివిడిగా సమావేశాలు

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం

ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యవహారంపై నేతల ఆరా!



హైదరాబాద్,నవరంబర్ 23

కాంగ్రెస్‌లో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని, ప్రభుత్వ పాలనపై ప్రజల్లోనూ ఎలాంటి వ్యతిరేకత లేదని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన బీఎం సందీప్.. గాంధీ భవన్‌కు వచ్చిన సందర్భంగా మంత్రులు ఆయనతో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఇన్‌చార్జితో సమావేశం ముగిసిన అనంతరం మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి తొలిసారి వచ్చిన సందీప్‌ను కేవలం మర్యాదపూర్వకంగానే కలిశానని, పార్టీ బలోపేతంపైనే చర్చించామని, ఎలాంటి అంతర్గత విషయాలు చర్చకు రాలేదని చెప్పారు.మరోవైపు గాంధీ భవన్‌లో కొత్త ఇన్‌ఛార్జి బీఎం సందీప్ వరుస సమీక్షలతో బిజీగా గడిపారు. పార్టీ నేతల మధ్య సమన్వయం పెంచే లక్ష్యంతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతోనూ ఆయన విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. నియోజకవర్గాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ పరిపాలన అంశాలపై మంత్రుల నుంచి వివరాలు సేకరించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్ఠతకు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.రాబోయే పట్టభద్రుల (గ్రాడ్యుయేట్) ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని సందీప్ దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో పార్టీ స్థితిగతులు, నాయకుల మధ్య సఖ్యతపై దృష్టి సారించారు. ఇటీవల పార్టీలో చర్చనీయాంశంగా మారిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డిల వివాదంపై డీసీసీ అధ్యక్షులు ఇన్‌చార్జికి ఫిర్యాదు చేసే అవకాశమున్నట్లు సమాచారం. డీసీసీ అధ్యక్షులతో పాటు సాయంత్రం పీసీసీ ముఖ్య నేతలు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులతోనూ సందీప్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

కర్రెగుట్ట అటవీప్రాంతంలోకి ఇప్పుడే పర్యాటకులకు అనుమతి లేదు: తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్



కర్రెగుట్ట వద్ద ప్రెషర్ మైన్ల ప్రమాదం ఉందన్న డీజీపీ

ఆ ప్రాంతాన్ని క్లియర్ చేసిన తర్వాతే టూరిస్టులకు అనుమతి ఉంటుందని వెల్లడి

మావోయిస్టులను విచారించడంతో 9 డంప్‌లను గుర్తించామన్న డీజీపీ

హైదరాబాద్,నవరంబర్ 23

కర్రెగుట్ట అటవీప్రాంతంలోకి పర్యాటకులను అనుమతిస్తే తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశముందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాస ప్యాకేజీ అందజేసే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కర్రెగుట్ట ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నప్పటికీ, భద్రతా కారణాల దృష్ట్యా ప్రస్తుతానికి అక్కడికి పర్యాటకుల రాకను అనుమతించబోమని తేల్చిచెప్పారు. ఆ ప్రాంతంలో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో వివిధ రకాల మైన్లు (మందుపాతరలు) అమర్చారని డీజీపీ వివరించారు. ముఖ్యంగా ప్రెషర్ మైన్స్ ఎక్కువగా ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని, అవి ఎక్కడెక్కడ ఉన్నాయనే దానిపై స్పష్టమైన సమాచారం లేదన్నారు. కొంతమంది మావోయిస్టులను విచారించడంతో 9 డంప్‌లను గుర్తించాం అని ఆయన పేర్కొన్నారు.ఈ 9 డంప్‌ల నుంచి 252 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని డీజీపీ తెలిపారు. ఆ ప్రాంతంలో ఉన్న మైన్లను పూర్తిగా తొలగించి, క్లియరెన్స్ వచ్చిన తర్వాతే పర్యాటకులను అనుమతిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా హింసామార్గాన్ని వీడి ప్రధాన స్రవంతిలోకి వచ్చిన 214 మంది మావోయిస్టులకు మొత్తం రూ. 5.59 కోట్ల నగదు రివార్డులు, పునరావాస సాయాన్ని అందజేశారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రశాంత జీవనం గడిపేలా అన్ని విధాలా సహకరిస్తుందని డీజీపీ పేర్కొన్నారు.

మావోయిస్టుల పునరావాసం.. రూ.5.59 కోట్లు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం

లొంగిపోయిన 214 మంది మావోయిస్టులకు రూ.5.59 కోట్లు విడుదల

సీఎం రేవంత్ రెడ్డి పిలుపుతో లొంగుబాట్లు పెరిగాయన్న అధికారులు

2024 నుంచి ఇప్పటిదాకా 824 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఇప్పటివరకు మొత్తం 659 మందికి రూ.17.68 కోట్లు పంపిణీ

ఆధార్, బ్యాంక్ వివరాలు ఇవ్వగానే మిగతావారికి నిధులు

హైదరాబాద్,నవరంబర్ 23

తెలంగాణలో జనజీవన స్రవంతిలో కలిసేందుకు లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తోంది. తమ పునరావాస విధానంలో భాగంగా లొంగిపోయిన 214 మంది మాజీ మావోయిస్టులకు నేడు రూ. 5.59 కోట్ల నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం విడుదల చేసింది.ఆయుధాలు విడిచిపెట్టి వచ్చిన వారికి పునరావాసం కల్పించి, వారిని తిరిగి సమాజంలో భాగం చేసే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2025 అక్టోబర్ 21న సాయుధ పోరాటాన్ని విడనాడి, జనజీవన స్రవంతిలో కలవాలని ఇచ్చిన పిలుపుతో లొంగుబాట్లు ఊపందుకున్నాయని ఆయన వివరించారు. 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 824 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో తెలంగాణకు చెందిన వారు 59 మంది ఉండగా, ఛత్తీస్‌గఢ్ నుంచి 754 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మంది, మహారాష్ట్ర, ఒడిశాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. లొంగిపోయిన వారిలో సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీ సభ్యులతో పాటు డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు, పార్టీ సభ్యులు, మిలీషియా సిబ్బంది కూడా ఉన్నారు.తాజా చెల్లింపులతో కలిపి ఇప్పటివరకు మొత్తం 659 మంది లబ్ధిదారులకు రూ.17.68 కోట్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 96 మంది అర్హులు తమ ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించిన వెంటనే వారికి కూడా మంజూరైన ప్రోత్సాహకాలను విడుదల చేయనున్నారు.

తెలంగాణలో 'కోత'ల మోత.. ప్రతీ పదిలో ఆరు సిజేరియన్లే!



సిజేరియన్ ప్రసవాల్లో దేశంలోనే తెలంగాణకు అగ్రస్థానం

రాష్ట్రంలో 62.2 శాతంగా నమోదైన సిజేరియన్ల రేటు

ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏకంగా 84 శాతం సిజేరియన్లే

జాతీయ సగటు 27.2 శాతం కంటే రెట్టింపునకు పైగా నమోదు

అనవసర ఆపరేషన్లపై ఆడిట్ చేయాలని నిపుణుల సూచన

హైదరాబాద్,నవరంబర్ 23

సిజేరియన్ ప్రసవాల విషయంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో జరుగుతున్న మొత్తం ప్రసవాల్లో ఏకంగా 62.2 శాతం సిజేరియన్ల ద్వారానే జరుగుతున్నట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా సిజేరియన్ల సగటు రేటు 27.2 శాతంగా ఉండగా, తెలంగాణలో ఇది రెట్టింపు కంటే ఎక్కువగా ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అంటే రాష్ట్రంలో జరిగే ప్రతి పది ప్రసవాల్లో ఆరుకు పైగా శస్త్రచికిత్సల ద్వారానే జరుగుతున్నాయి. 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఈ సర్వే నివేదిక ప్రకారం.. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల మధ్య ఈ విషయంలో భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏకంగా 83.9 శాతం ప్రసవాలు సిజేరియన్ల ద్వారానే సాగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ రేటు 48.1 శాతంగా ఉంది. జాతీయ స్థాయిలో ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్ల సగటు 54.1 శాతం మాత్రమే కావడం గమనార్హం. గత సర్వే (2019-21)లో 60.7 శాతంగా ఉన్న సిజేరియన్ల రేటు, ఇప్పుడు 62.2 శాతానికి పెరగడం గమనార్హం. పట్టణ ప్రాంతాల్లో ఇది 70.1 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 59.5 శాతంగా నమోదైంది.ఈ గణాంకాల నేపథ్యంలో, ప్రతి సిజేరియన్‌కు సరైన వైద్య కారణం ఉందా లేదా అన్నది నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసర సిజేరియన్లను అరికట్టేందుకు ఆసుపత్రుల వారీగా ఆడిట్ నిర్వహించాలని సూచిస్తున్నారు. గర్భిణులకు సాధారణ ప్రసవం వల్ల కలిగే ప్రయోజనాలు, సిజేరియన్ల వల్ల తలెత్తే ఆరోగ్య సమస్యలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల వాటా 49.7 శాతం నుంచి 57.5 శాతానికి పెరగడం సానుకూల పరిణామం. తల్లీబిడ్డల ఆరోగ్యానికి అత్యవసరమైనప్పుడు శస్త్రచికిత్సలు తప్పనిసరి అయినప్పటికీ, అనవసరంగా చేసే సిజేరియన్లను నివారించేందుకు పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ అవసరమని వైద్య వర్గాలు సూచిస్తున్నాయి.

హైదరాబాద్ గోల్డ్ మ్యాన్ చిన్న గౌడ్‌పై ఐటీ కొరడా..

బినామీ ఆస్తిగా ప్రాథమిక నిర్ధారణ..

అమ్మకాలపై నిషేధం

నెలవారీ అద్దె ఆదాయం చిన్న గౌడ్ భార్య ఖాతాలోకి మళ్లింపు

గతంలో 700 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్న ఐటీ శాఖ

హైదరాబాద్,నవరంబర్ 23

హైదరాబాద్‌లో 'గోల్డ్ మ్యాన్'గా పేరుగాంచిన యాదగిరి చిన్న గౌడ్ అలియాస్ దర్గా చిన్న పహిల్వాన్‌కు ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ గట్టి షాక్ ఇచ్చింది. బినామీ ఆస్తుల నిరోధక విభాగం రంగంలోకి దిగి, రాయదుర్గంలో ఉన్న ఆయనకు చెందిన ఓ భారీ అపార్ట్‌మెంట్ భవనాన్ని తాత్కాలికంగా అటాచ్ చేసింది. ఈ ఆస్తి చిన్న గౌడ్ బావమరిది ప్రణయ్ గౌడ్ పేరు మీద రిజిస్టర్ అయి ఉన్నప్పటికీ, దాని అసలు లబ్ధిదారుడు చిన్న గౌడే అని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. దీంతో ఆ భవనాన్ని, దాని ద్వారా వచ్చే అద్దె ఆదాయాన్ని కూడా ఫ్రీజ్ చేశారు. తుది ఉత్తర్వులు వెలువడే వరకు ఆస్తిని అమ్మడం, బదిలీ చేయడం లేదా ఇతరులకు అప్పగించడంపై నిషేధం విధించారు.ఐటీ శాఖ దర్యాప్తు ప్రకారం.. శేరిలింగంపల్లి పరిధిలోని రాయదుర్గంలో 222 చదరపు గజాల స్థలాన్ని 2019 జూలైలో కొనుగోలు చేశారు. పత్రాల్లో రూ. 26.70 లక్షలుగా విలువ చూపగా, ఈ నిధులన్నీ తన బావ చిన్న గౌడ్ సమకూర్చినట్లు ప్రణయ్ గౌడ్ విచారణలో అంగీకరించినట్లు తెలిసింది. స్థలం కొనుగోలు సమయంలో తాను విద్యార్థినని, ఎలాంటి ఆదాయం లేదని కూడా ఆయన వెల్లడించారు. ఆ తర్వాత ఆ స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. దీని నిర్మాణానికి అవసరమైన డబ్బును కూడా చిన్న గౌడే సమకూర్చినట్లు ప్రణయ్ స్వచ్ఛంద వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఈ అపార్ట్‌మెంట్‌కు నెలకు రూ. 3.20 లక్షల అద్దె వస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. అయితే ఈ అద్దె డబ్బులు ఆస్తి యజమానిగా ఉన్న ప్రణయ్ ఖాతాలోకి కాకుండా, చిన్న గౌడ్ భార్య బ్యాంకు ఖాతాకు, అక్కడి నుంచి చిన్న గౌడ్ ఖాతాలకు బదిలీ అయినట్లు అధికారులు గుర్తించారు. దీంతో ప్రణయ్‌ను బినామీదారుడిగా, చిన్న గౌడ్‌ను అసలు లబ్ధిదారుడిగా పేర్కొంటూ ఐటీ శాఖ జాయింట్ కమిషనర్ నవంబర్ 17న తాత్కాలిక అటాచ్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేశారు. బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధ చట్టం-1988 కింద ఈ చర్యలు తీసుకున్నారు.గతంలో చిన్న గౌడ్ పలు యూట్యూబ్ ఛానెళ్లకు ఇంటర్వ్యూలు ఇవ్వడంతో ఐటీ శాఖ ఆయనపై దృష్టి సారించింది. ఏప్రిల్‌లో సోదాలు నిర్వహించి, అతని వద్ద ఉన్న 900 గ్రాముల బంగారంలో, 700 గ్రాములకు సరైన లెక్కలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. తన ఐటీ రిటర్నుల్లో కేవలం రూ. 4 లక్షల ఆదాయం మాత్రమే చూపిన చిన్న గౌడ్ వద్ద ఇంతటి ఆస్తులు ఎలా సమకూరాయనే కోణంలో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తాజాగా బినామీ ఆస్తిని అటాచ్ చేయడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది.



ఖాకీ చొక్కా వదిలి కార్పొరేట్ సూటు..

రిటైర్డ్ హైదరాబాద్ పోలీస్ అధికారులకు కార్పొరేట్ రంగంలో భారీ డిమాండ్

రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, సెక్యూరిటీ సంస్థల్లో కీలక బాధ్యతలు

రిటైర్మెంట్‌కు ముందే అధికారులను సంప్రదిస్తున్న ప్రముఖ కంపెనీలు

సంక్షోభ నిర్వహణ, కౌన్సెలింగ్, లీగల్ అంశాల పరిష్కారంలో వీరికి ప్రాధాన్యం

మొండి బకాయిల రికవరీ, అంతర్గత వివాదాల పరిష్కారంలో ప్రత్యేక బాధ్యతలు



హైదరాబాద్,నవరంబర్ 23

రిటైర్మెంట్ తర్వాత ఇంటికే పరిమితం కాకుండా.. హైదరాబాద్‌కు చెందిన మాజీ పోలీసు అధికారులు కార్పొరేట్ రంగంలో సరికొత్త ప్రస్థానాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలుస్తోంది. దశాబ్దాల పాటు శాంతిభద్రతల పరిరక్షణలో గడించిన అనుభవం, సంక్షోభ నిర్వహణ నైపుణ్యాలు వారికి కార్పొరేట్ సంస్థల్లో భారీ జీతాలతో కూడిన ఆకర్షణీయమైన కొలువులను తెచ్చిపెడుతున్నాయి. రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, సెక్యూరిటీ, విద్య, హెల్త్‌కేర్ వంటి కీలక రంగాల్లోని ప్రముఖ కంపెనీలు రిటైర్డ్ పోలీస్ అధికారులకు నెలకు రూ. 1.5 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ వేతనాలు, అదనపు అలవెన్సులు అందిస్తూ స్వాగతం పలుకుతున్నాయి.ఓ ఆంగ్ల మీడియా కథనం ప్రకారం.. పాలనాపరమైన వ్యవహారాలు చక్కబెట్టడం, విపత్కర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొన్న ట్రాక్ రికార్డు ఉండటంతో కార్పొరేట్ కంపెనీలు వీరి సేవలకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాయి. పదవీ విరమణకు కొన్ని నెలల ముందే కంపెనీలు మంచి సర్వీస్ రికార్డు ఉన్న అధికారులను సంప్రదిస్తున్నాయి. ఇటీవల పదవీ విరమణ చేసిన ఓ డీఎస్పీ స్థాయి అధికారి మాట్లాడుతూ.. సర్వీస్ ముగియకముందే మూడు కంపెనీలు తనను సంప్రదించాయని తెలిపారు. ప్రయోజనాలను బేరీజు వేసుకుని ఒక రియల్ ఎస్టేట్ సంస్థలో చేరినట్లు వెల్లడించారు. నెగోషియేషన్లు, కౌన్సెలింగ్, సమర్థమైన కమ్యూనికేషన్ ద్వారా సమస్యలను పరిష్కరించే సామర్థ్యం వీరిని కార్పొరేట్ రంగానికి మరింత దగ్గర చేస్తోంది.లీగల్ కన్సల్టెంట్లుగా, సెక్యూరిటీ హెడ్స్‌గా మాత్రమే కాకుండా.. మొండి బకాయిల వసూలు, ఆర్థిక మోసాల అడ్డుకట్ట, అంతర్గత వివాదాల పరిష్కారం, వ్యాపార విస్తరణకు తమ నెట్‌వర్క్‌ను వినియోగించడంలో వీరి నైపుణ్యాలను యాజమాన్యాలు వాడుకుంటున్నాయి. ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) లేదా అంతకంటే ఉన్నత హోదాలో రిటైరైన సీనియర్ అధికారులను పెద్ద కంపెనీలు కీలక అంశాల్లో సలహాదారులుగా నియమించుకుంటున్నాయి. మరోవైపు, యువ ఉద్యోగులతో కలిసి పనిచేయడం, కొత్త వాతావరణంలోకి అడుగుపెట్టడం వల్ల పదవీ విరమణ తర్వాత వచ్చే ఒంటరితనాన్ని దూరం చేసుకుంటూ ప్రొఫెషనల్ లైఫ్‌ను ఉత్సాహంగా కొనసాగించే అవకాశం వీరికి లభిస్తోంది.

కూకట్‌పల్లిలో హుడా ట్రక్ పార్కింగ్ స్థలం వేలాన్ని వ్యతిరేకిస్తూ ఈటల రాజేందర్ ధర్నా



ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ తరహాలో అమ్మడం సరికాదన్న ఈటల రాజేందర్

నియోపోలిస్, గచ్చిబౌలి, ఐడీఎల్ భూముల వ్యవహారాలపై విచారణకు డిమాండ్

భావితరాల కోసం ప్రభుత్వ భూములను కాపాడాలని వ్యాఖ్య

హైదరాబాద్,నవరంబర్ 23

ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాదిరిగా విక్రయించడం ఎంతమాత్రం సరికాదని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని వై జంక్షన్ మెట్రో వద్ద ఉన్న ఉన్న హుడా ట్రక్ పార్కింగ్ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు.ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను ప్రభుత్వం ఇలా వేలం వేసుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రజలకు, రాబోయే తరాలకు ఖాళీ స్థలాలే లేకుండా పోతాయని ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాల కోసం ఆలోచించాలి తప్ప, ఆదాయం కోసం భూములు అమ్మే వ్యాపార సంస్థల్లా వ్యవహరించకూడదని ఆయన హితవు పలికారు. పేదలకు కేటాయించిన అసైన్డ్ భూములతో పాటు ప్రజావసరాల కోసం ఉద్దేశించిన స్థలాలను ప్రభుత్వం బాధ్యతాయుతంగా కాపాడాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని కీలక ప్రాంతాల్లో జరిగిన భూ కేటాయింపులపై ఆయన పలు అనుమానాలు వ్యక్తం చేశారు. నియోపోలిస్, గచ్చిబౌలి, ఐడీఎల్, ఎల్లమ్మబండ, భాగ్యనగర్ పరిధిలోని వివాదాస్పద భూముల వ్యవహారాలపై వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎప్పుడు ఎన్నికలు జరిగినా కోటి ఓట్లు, 90 సీట్లు సాధిస్తాం: పీసీసీ మహేశ్ కుమార్ గౌడ్

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కోటి ఓట్లు.. 90 సీట్లను తప్పక సాధిస్తామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ నెల 26న సంవిధాన్ ర్యాలీని నిర్వహిస్తున్నామని.. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు పాల్గొనాలని ఆయన కోరారు.

హైదరాబాద్, నవంబరు 23:

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కోటి ఓట్లు.. 90 సీట్లను తప్పక సాధిస్తామని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ నెల 26న సంవిధాన్ ర్యాలీని నిర్వహిస్తున్నామని.. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు పాల్గొనాలని ఆయన కోరారుగాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్ భగవత్ ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను దేశంలో వేరే ఏ రాష్ట్రాల్లోనూ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. 'కోటి ఓట్లు– తొంభై సీట్లు' అనే నినాదంతో కాంగ్రెస్ ముందుకు పోతోందని.. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా.. కోటి ఓట్లు, 90 సీట్లను తప్పకుండా సాధిస్తామని ఆయన పేర్కొన్నారు.కాగా.. ఈనెల 26వ తేదీన లిబర్టీ నుంచి అబిడ్స్ నెహ్రూ విగ్రహం వరకు సంవిధాన్ ర్యాలీ నిర్వహిస్తున్నామని.. ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ కోరారు. ఆయన ప్రత్యేకంగా నూతన ఏఐసీసీ ఇన్‌చార్జ్ సందీప్ కుమార్‌తో భేటీ కాలేదని.. భేటీ అయ్యాక అన్నీ విషయాల గురించి చర్చిస్తామని మహేశ్ తెలిపారు.



సికింద్రాబాద్ నుంచి కాశీ, అయోధ్యలకు 'భారత్ గౌరవ్' రైలు.. తెలంగాణ, ఏపీలో ఆగే స్టేషన్లు ఇవే!



డిసెంబర్ 5న సికింద్రాబాద్ నుంచి ప్రారంభం కానున్న భారత్ గౌరవ్ రైలు

మొత్తం 9 రాత్రులు 10 రోజుల పాటు సాగనున్న ఆధ్యాత్మిక యాత్ర

కాశీ, అయోధ్య, ప్రయాగ్‌రాజ్, పూరి దర్శనాలకు అవకాశం

తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రధాన స్టేషన్లలో బోర్డింగ్ సదుపాయం

ఆహారం, హోటల్ వసతి, బీమాతో కూడిన ప్యాకేజీ ధరల ఖరారు

హైదరాబాద్,నవరంబర్ 23

భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ పర్యాటకులు, భక్తుల కోసం మరో ప్రత్యేక ఆధ్యాత్మిక యాత్రను అందుబాటులోకి తీసుకువచ్చింది. 'వారణాసి--అయోధ్య పుణ్యక్షేత్ర యాత్ర' పేరిట భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు సంస్థ ప్రకటించింది. ఈ రైలు 2026 డిసెంబర్ 5వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరనుంది.

యాత్ర కాలవ్యవధి, సీట్ల వివరాలు:

ఈ యాత్ర మొత్తం 9 రాత్రులు, 10 రోజుల పాటు సాగుతుంది. ప్రయాణికుల కోసం ఈ రైలులో మొత్తం 705 సీట్లను కేటాయించారు. ఇందులో స్లీపర్ క్లాస్ (ఎకానమీ) విభాగంలో 237 సీట్లు, థర్డ్ ఏసీ (3టూ) విభాగంలో 416 సీట్లు, సెకండ్ ఏసీ (2టూ) విభాగంలో 52 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

రైలు ఆగే స్టేషన్లు (బోర్డింగ్ / డీబోర్డింగ్):

తెలుగు రాష్ట్రాల్లోని ప్రయాణికులకు అనుకూలంగా పలు కీలక స్టేషన్లలో రైలు ఎక్కేందుకు, దిగేందుకు ఐఆర్‌సీటీసీ ఏర్పాట్లు చేసింది. సికింద్రాబాద్‌తో పాటు చర్లపల్లి, కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో బోర్డింగ్, డీబోర్డింగ్ సదుపాయం కల్పించారు.

సందర్శించే పుణ్యక్షేత్రాలు:

పూరి: జగన్నాథ స్వామి దర్శనం, ప్రత్యేక పూజలు, కోణార్క్ సూర్య దేవాలయ సందర్శన.

బద్రీనాథ్ ధామ్: బద్రీనాథ్ దర్శనం.

వారణాసి: కాశీ విశ్వనాథ ఆలయం, విశాలాక్షి, అన్నపూర్ణ అమ్మవార్ల దర్శనం, కాశీ కారిడార్ సందర్శన మరియు సాయంత్రం ప్రసిద్ధ గంగా హారతి తిలకించే అవకాశం.

అయోధ్య: బలరామ్ మందిర్, హనుమాన్ గర్హి దర్శనం, సరయూ నది హారతి.

ప్రయాగ్‌రాజ్: త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం.

ఈ క్షేత్రాల దర్శనం అనంతరం రైలు తిరిగి సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ప్యాకేజీ ధరల వివరాలు (ఒక్కొక్కరికి):

ఎకానమీ (స్లీపర్): పెద్దలకు రూ.17,000, 5 నుంచి 11 ఏళ్ల లోపు చిన్నారులకు రూ.15,800

స్టాండర్డ్ (3టూజ): పెద్దలకు రూ.26,400, చిన్నారులకు రూ.25,000

కంఫర్ట్ (2టూజ): పెద్దలకు రూ.34,400, చిన్నారులకు రూ.32,700ఈ ప్యాకేజీ ధరల్లో రైలు ప్రయాణ చార్జీలతో పాటు స్థానిక సందర్శనకు రోడ్డు రవాణా, హోటల్ వసతి, ఉదయం అల్పాహారం, భోజనం వంటి ఆహార సదుపాయాలు, ప్రయాణ బీమా అన్నీ కలిపి ఉంటాయని సంస్థ స్పష్టం చేసింది.ఈ యాత్రకు సంబంధించిన టికెట్ బుకింగ్స్, ఇతర పూర్తి వివరాలు తెలుసుకోవడానికి ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌ను పరిశీలించవచ్చని అధికారులు సూచించారు.

సరిహద్దులు దాటిన ప్రేమ

బ్రిటన్ అమ్మాయి, ఖమ్మం అబ్బాయి ఒక్కటయ్యారు

ఖమ్మం యువకుడిని వివాహం చేసుకున్న బ్రిటన్ యువతి

ఇంగ్లాండ్‌లో ఒకేచోట పనిచేస్తూ ప్రేమలో పడ్డ జంట

ఖమ్మంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహ వేడుక

ఇరు కుటుంబాల అంగీకారంతో ఒక్కటైన ప్రేమికులు

హైదరాబాద్,నవరంబర్ 23

ప్రేమకు దేశ సరిహద్దులతో సంబంధం లేదని మరోసారి నిరూపితమైంది. ఖమ్మం నగరానికి చెందిన యువకుడు, బ్రిటన్‌కు చెందిన యువతి హిందూ సంప్రదాయ పద్ధతిలో ఆదివారం వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఇంగ్లాండ్‌లోని ఒకే కార్యాలయంలో పనిచేస్తున్న సమయంలో వీరి మధ్య చిగురించిన పరిచయం ప్రేమగా మారి, పరిణయానికి దారితీసింది.వివరాల్లోకి వెళితే.. ఖమ్మం ముస్తాఫానగర్‌కు చెందిన సగ్గుర్తి లక్ష్మణ్, రోజా దంపతుల కుమారుడు భరత్, స్థానికంగా ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం ఇంగ్లాండ్ వెళ్లారు. 2021లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన ఆయన, అక్కడే ప్రభుత్వ పెన్షన్ విభాగంలో ఉద్యోగంలో చేరారు. అదే విభాగంలో బ్రిటన్‌కు చెందిన ఎడ్మిన్ ఆర్మ్‌స్ట్రాంగ్, హాజెల్ గ్రేలీల కుమార్తె ఎలిజబెత్ కూడా వనిచేన్తున్నారు. కార్యాలయంలో ఏర్పడిన పరిచయం కొద్దికాలానికే ప్రేమగా మారింది. దీంతో వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్న ఈ జంట, తమ కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశారు. ఇరు కుటుంబాలు వీరి నిర్ణయానికి అంగీకారం తెలపడంతో, ఖమ్మంలోని బోనకల్లు రోడ్డులో ఉన్న ఒక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం హిందూ సంప్రదాయాల ప్రకారం వీరి వివాహం ఘనంగా జరిగింది.

మన ప్రజాశక్తి తెలుగు దినపత్రిక
ప్రజలకోసమే.. ఈ పత్రిక
www.ManaPrajasakti.com తెలంగాణ ఆంధ్రప్రదేశ్

తెలుగు, తమిళంలో నటన కంటే శరీర భాగాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు: తాప్సీ

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను ప్రముఖ నటి తాప్సీ పన్ను పంచుకున్నారు. తాను తమిళం, తెలుగు సినిమాల్లో పనిచేసిన రోజుల్లో కెమెరా ముందు శరీర భాగాలు మరింత ప్రముఖంగా కనిపించేందుకు దర్శకులు హీరోయిన్లను ప్యాడెడ్ బ్రాస్ ధరించమని కోరేవారని ఆమె వెల్లడించారు. శుభాంకర్ మిశ్రా యూట్యూబ్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రేక్షకుల ఆసక్తికి అనుగుణంగా, విజువల్ అప్పీల్ పెంచేందుకే నటన కంటే శారీరక సౌందర్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారని ఆమె పేర్కొన్నారు.



సినిమాలే జీవితం కాదు.. ఆ గ్యాప్ నాకోసం



నటనకు ప్రాధాన్యతనిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నిత్యా మేనన్, తన కెరీర్‌లో తరచుగా తీసుకునే విరామాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాలే జీవితం కాదని, వ్యక్తిగత జీవితానికి కూడా సమయం కేటాయించుకోవాలనేది తన అభిప్రాయమని స్పష్టం చేశారు. చాలామంది హీరోయిన్లు వరుస అవకాశాలతో బిజీగా ఉండాలనుకుంటే, తాను మాత్రం అందుకు భిన్నంగా ఆలోచిస్తానని తెలిపారు.ఒక సినిమా పూర్తయ్యాక వెంటనే మరో ప్రాజెక్ట్‌లో చేరకుండా కొంత గ్యాప్ తీసుకోవడం తనకు అలవాటని నిత్య తెలిపారు. ఈ విరామ సమయాన్ని తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి, కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఉపయోగించుకుంటానని చెప్పారు. వరుసగా సినిమాలు చేస్తూ నిరంతరం కెమెరా ముందు ఉండటం తనకు సాధ్యం కాదని, ప్రతి పాత్రలో సహజంగా ఒదిగిపోవాలంటే నటీనటులకు మానసిక సన్నద్ధత అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.



ప్రేమ, బ్రేకప్ రెండూ

కష్టమేనంటున్న మీనాక్షి చౌదరి

టాలీవుడ్ హీరోయిన్ మీనాక్షి చౌదరి తనదైన చలాకీ మాటలతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వృషకర్మ' ప్రమోషన్లలో చురుగ్గా పాల్గొంటున్న ఆమె, తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో యాంకర్... 'ప్రస్తుతం మీకు ఎవరిపైనైనా క్రష్ ఉందా?' అని మీనాక్షిని ప్రశ్నించారు. దీనికి ఆమె ఏమాత్రం తడుముకోకుండా నవ్వుతూ బదులిచ్చారు. "నాకు ఎవరిపైనా ఎలాంటి క్రష్ లేదు.. అసలు నా జీవితమే క్రష్ అయిపోయింది (నలిగిపోయింది)" అంటూ చమత్కరించారు. వరుస ప్రాజెక్టులు, తీరికలేని షూటింగులు, ప్రమోషన్స్ వల్ల వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించలేకపోతున్న విషయాన్ని ఆమె ఈ విధంగా సరదాగా వివరించారు.అలాగే ప్రేమ, రిలేషన్‌షిప్‌లపై అడిగిన మరో ప్రశ్నకు స్పందిస్తూ.. "నాకు తెలియదు కానీ.. ప్రేమలో పడటం, బ్రేకప్ నుంచి బయటపడటం రెండూ కష్టమే" అని మీనాక్షి వ్యాఖ్యానించారు

'రామాయణ'పై ఏఆర్ రెహమాన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్!



దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కించిన పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ' గురించి మ్యూజిక్ డైరెక్టర్, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. ఈ సినిమా కోసం ఏకంగా 10 నుంచి 12 సినిమాలను వదులుకున్నట్లు తెలిపాడు. ప్రముఖ హాలీవుడ్ లెజెండరీ సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో కలిసి గత మూడేళ్లుగా ఈ ప్రాజెక్ట్ మీదే పూర్తి దృష్టి సారించినట్లు వెల్లడించాడు. గోవాలో జరుగుతున్న భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల (ఇఫీ) వేదికగా విలేకరుల సమావేశంలో మాట్లాడిన రెహమాన్.. ఈ సినిమా సంగీతం వెనుక సాగిన శ్రమను పంచుకున్నాడు.

సినిమా హీరోలకు.. నిజ జీవితంలోని పవర్‌ఫుల్ వ్యక్తులకు తేడా అదే

సినిమాల్లో కండలు తిరిగిన దేహంతో, సిక్స్ ప్యాక్‌తో కనిపించే హీరోలకు, నిజ జీవితంలో అధికారం చెలాయించే శక్తిమంతులకు ఏమాత్రం సంబంధం ఉండదని ప్రముఖ సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ అభిప్రాయపడ్డారు. వాస్తవానికి సిక్స్ ప్యాక్ ఉన్న వ్యక్తి, అది లేని వ్యక్తి కింద పనిచేయడమే నిజ జీవితంలో కనిపించే వాస్తవమని తన 'ఎక్స్' ఖాతాలో ఆర్‌జీవీ ఆసక్తికర పోస్ట్ చేశారు.



'మయూఖ' (జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ!

సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాల పట్ల ఆడియన్స్ విపరీతమైన ఆసక్తిని చూపిస్తుంటారు. సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలకి రిపీట్ ఆడియన్స్ ఉండరని అంటారు. అయితే టేకింగ్ బాగుంటే, ఈ తరహా సినిమాలను మళ్లీ మళ్లీ చూడటానికి కుతూహలాన్ని కనబరుస్తూ ఉంటారు. అలాంటి జోనర్ లో రూపొందిన 'మయూఖ', అక్టోబర్ 9వ తేదీన థియేటర్లకు వచ్చింది. పెద్దగా పబ్లిసిటీ లేకుండా విడుదలైన ఈ సినిమా, ఈ నెల 20వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది.మయూఖ (పాయల్ చెంగప్ప) ఒక ఫ్లాట్ లో రెంట్ కి ఉంటూ, ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తూ ఉంటుంది. ఆ బ్యాంకుకి మేనేజర్ గా వినయ్ ఉంటాడు. హనీ .. అభిరామ్ కూడా మయూఖతో కలిసి పనిచేస్తూ ఉంటారు. ఆ బ్యాంకుకి సెక్యూరిటీగా రవి ఉంటాడు. మయూఖకి ఫైర్ అంటే చాలా భయం. అంతేకాదు తరచూ ఆమెకి ఒక చిత్రమైన కల వస్తుంటుంది. అంతేకాదు తనతో పాటు ఆ రూమ్ లో ఎవరో ఉన్నట్టుగా, రాత్రివేళలో తన ఫ్లాట్ డోర్ ఓపెన్ చేయడానికి ఎవరో ప్రయత్నిస్తున్నట్టుగా అనిపిస్తూ ఉంటుంది. కార్పెంటర్ 'కుమార్' అనే వ్యక్తి, మయూఖ కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతూ ఉంటాడు. తనతో కలిసి కాఫీకి రమ్మంటూ టార్చర్ చేస్తుంటాడు. ఇక బ్యాంకు సెక్యూరిటీ గార్డుగా ఉన్న రవి కూడా మయూఖను వంకరగా చూస్తుంటాడు. ఈ సమస్యలే ఆమెను సతమతం చేస్తుంటే, అభిరామ్ కూడా ఆమెకి తలనొప్పిగా తయారవుతాడు. ఒకసారి మయూఖ ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె ఫ్లాట్ కి వచ్చిన అభిరామ్, ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తాడు. ఆమె అతణ్ణి ఫ్లాట్ లో బంధించి పోలీసులను రప్పిస్తుంది. పోలీసులు వచ్చేలోగా అభిరామ్ చనిపోతాడు. ఇది ఎలా జరిగిందనేది అర్థంకాక మయూఖ అయోమయంలో పడిపోతుంది. అప్పటి నుంచి పోలీస్ ఆఫీసర్ శ్రీధర్ పర్యవేక్షణలో, మిగతా పోలీసులు ఆమె కదలికలను కనిపెడుతూ ఉంటారు. అయితే అభిరామ్ హత్యకి గల కారణాలు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో, ముసుగులో ఉన్న సైకో కిల్లర్ ను మయూఖ చూస్తుంది. ఆ సైకో కిల్లర్ దగ్గర ఒక చిత్రమైన సెంటు వాసన వస్తుందని శ్రీధర్ కి మయూఖ చెబుతుంది. ఆ సైకో కిల్లర్ ఎవరు? అతని దగ్గర ఒక రకమైన సెంటువాసన రావడానికి కారణం ఏమిటి? అనేదే మిగతా కథ.



భర్త వీర్ సాహు నుంచి విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించిన సప్నా చౌదరి



హర్యానాకు చెందిన ప్రముఖ సింగర్, డ్యాన్సర్, మాజీ బిగ్‌బాస్ కంటెస్టెంట్ సప్నా చౌదరి తన వైవాహిక జీవితానికి ముగింపు పలికారు. తన భర్త వీర్ సాహు నుంచి విడాకులు కోరుతూ ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుమారు 6 సంవత్సరాల పాటు కలిసి ఉన్న ఈ దంపతులు ఇప్పుడు విడిపోవాలని నిర్ణయించుకోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది.ఈ విడాకుల అంశంపై సప్నా చౌదరి ఇటీవల ఎన్ఎమ్ఎఫ్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. తమ బంధం ఎందుకు ముగిసిపోయిందనే విషయం కేవలం తనకు, వీర్ సాహుకు మాత్రమే స్పష్టంగా తెలుసని ఆమె అన్నారు. సంబంధం బాగున్నంత కాలం కలిసి ఉన్నామని, పరిస్థితులు అనుకూలించనప్పుడు పరస్పర అంగీకారంతో విడిపోవడమే సరైన మార్గమని భావించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సంబంధాలు, నమ్మకం గురించి మాట్లాడుతూ.. ప్రేమ అనేది శారీరక సంబంధం మాత్రమే కాదని, అది మనసుకు, భావోద్వేగాలకు సంబంధించినదని వివరించారు. పురుషులు ప్రాక్టికల్‌గా ఉంటారని, మహిళలు మాత్రం భావోద్వేగాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారని చెబుతూ మోసం జరిగిందన్న రీతిలో పరోక్ష వ్యాఖ్యలు చేశారు.